క్లుప్తంగా

పూడికల తొలగింపు



పూడికల తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటరమేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ప్రధాన మురుగు కాల్వలో పూడికల తొలగింపు పనులను శుక్రవారం కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రైతులు ఫిర్యాదు మేరకు శానిటరీ సిబ్బందితో కాల్వలో పూడికలు తొలగించే పనులు చేపట్టామన్నారు. ఇందులో భారీగా వ్యర్థాలు పేరుకు పోవడం వల్ల పంట పొలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. వార్డు ప్రజలు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదని కోరారు. క్లాప్ వాహనాలకు ఇంటి నుంచి వచ్చే తడి పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మల్కాపురం: స్థానిక దుర్గానగర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ముగ్గురు పోలీసులకు పట్టుబడ్డారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ..దుర్గానగర్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు మల్కాపురం పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ వెళ్లి ఆ వ్యక్తులను పట్టుకుని వారి నుంచి రూ. 17 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ లూథర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో శుక్రవారం వేకువ జామున 29వ రోజు మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భగవంతుని నామం జపిస్తూ పల్లకిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మేలుకొలుపులో భగవంతుని నామం పలకడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మంచి మార్పు వచ్చి ఉన్నత లక్ష్యం వైపు అడుగులు పడతాయని దేవాలయ కమిటీ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు సూచించారు. మేలుకొలుపు కార్యక్రమంలో మాతృమూర్తులు, గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, పెద్దలు మాసవరపు అప్పలనాయుడు, కూండ్రపు సన్యాసినాయుడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, దుంగల అప్పారావు, కడిమిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముస్లింల చందనోత్సవ యాత్ర



మర్రిపాలెంలో వేడుకలు చేసుకుంటున్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం మసీద్ వీధిలో మస్జిద్-ఈ-అల్ ఫతా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలా ఆలీ నిషానీ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం శ్యామ్ నగర్ కాలనీ, గ్రీన్ గార్డెన్స్, పార్వతీ నగర్, హుస్సేన్ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్ తదితర ప్రాంతాల్లో చందనోత్సవ యాత్ర చేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఢమాల్ పార్టీ పలువురిని ఆకర్షించింది. యాత్ర అనంతరం ముస్లింలు మసీద్ సమీపంలోని హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలా ఆలీ వారి నిషాని షరీఫ్ వద్ద ఫాతెహా తభ్రుక్ అందజేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ పర్యవేక్షించిన కార్యక్రమంలో బాబా, ఉమర్, ఉర్సు కమిటీ సభ్యులు మున్నా, నాసీర్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

సంబరాల సంక్రాంతి

- కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణాలు
- రద్దీగా మారిన రహదారులు



శ్రీహరిపురం మెయిన్ రోడ్డులో స్వీట్ షాప్ వద్ద భోగి సంబరాలు



గోపాలపట్నంలో వస్త్ర దుకాణాల వద్ద జన కోలాహలం



మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో విద్యార్థినుల సందడి



గోపాలపట్నం మాల్ వద్ద రద్దీ

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. శనివారం భోగి పండగ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఇళ్ల ముందు మహిళలు రంగు రంగుల ముగ్గులు వేశారు. శ్రీహరిపురం మెయిన్ రోడ్డులోని శ్రీనివాస్ స్వీట్ షాప్ యజమాని తన దుకాణం ముందు భోగి, సంక్రాంతి శోభను తలపించేలా సెట్ వేసి వేడుకలు నిర్వహించారు. కొనుగోలుదారులు అక్కడ సందడి చేశారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల వద్ద అధ్యాపకులు, విద్యార్థినులు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరిపారు. కాలేజీకి సెలవు రోజైనప్పటికీ విద్యార్థులంతా ఇక్కడ చేరి సందడి చేశారు.

మార్కెట్‌కు పండగొచ్చింది

గోపాలపట్నం: సంక్రాంతి పండగొచ్చింది. అందరిలో సందడి తెచ్చింది. వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. రహదారులు రద్దీగా మారాయి. పండగకు ఒక రోజే ఉండడంతో దుస్తులు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. ఇక్కడి గోపాలపట్నంలో ప్రధాన వస్త్ర దుకాణాలు కళకళలాడాయి. రోడ్లు సైతం వాహనాల రాకపోకలతో రద్దీగా మారాయి. దీంతో ట్రాఫిక్ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. వాహనాలు ఆగకుండా వెళ్లేవిధంగా చర్యలు చేపట్టారు.

సంప్రదాయ తినుబండారాలతో...

స్వీట్ దుకాణాలు సంప్రదాయ తినుబండారాలతో ఆకట్టుకుంటున్నాయి. పండగ సందర్భంగా ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వరకు ఉన్న స్వీట్ దుకాణాల నిర్వాహకులు సాంప్రదాయ వంటకాలైన అరిసెలు, పొంగడాలు, బూరెలు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో అందిస్తున్నారు. ఎన్‌ఏడీ శార్వాణి స్వీట్స్ వంటివి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.



మల్కాపురంలో ఓ ఇంటి ముందు సంక్రాంతి ముగ్గు వేస్తున్న మహిళ

మర్యాదపూర్వక కలయిక



తహసీల్దార్ వీరభద్రరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: ములగాడ మండల తహసీల్దార్ డి.వీరభద్రరావును కార్యాలయంలో శుక్రవారం 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, కోరమాండల్ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. 58వ వార్డు ములగాడ, ఏదురవానిపాలెం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను నిరుపేదలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాల వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం నేడు

సీతంపేట: భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్కయ్య పాలెం లలితా పీఠం, శ్రీనివాసనగర్ శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, సీతంపేట రాధాకృష్ణ మందిరంలో శనివారం గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లలితా పీఠంలో ఉదయం 9గంట ల కు గోదారంగనాయకుల దివ్య కల్యాణ మహోత్సవం సామూహికంగా జరుగుతుందని, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

‘112’ స్పందన అద్వితీయం

గంటలో బాధితురాలికి నగదు బ్యాగ్ అందజేత



ఆదిలక్ష్మి సమక్షంలో ఆటో డ్రైవర్‌కు నగదు పారితోషికం అందిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

గోపాలపట్నం: ఆటోలో మరచిపోయిన నగదు ఉన్న బ్యాగ్‌ను బాధితురాలికి గంటలో అందించి గోపాలపట్నం క్రైం పోలీసులు ప్రశంసలు అందుకున్నారు. క్రైం ఎస్‌ఐ ఎస్ నర్సింగరాజు తెలిపిన వివరాలిలా.. గాజువాకకు చెందిన ఆదిలక్ష్మి.. భర్త పిల్లతో బొబ్బిలి వెళ్లేందుకు సింహాచలం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. అప్పటికే ట్రైన్ వెళ్లి పోవడంతో సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి సింహాచలం బస్ కాంప్లెక్స్‌కు ఆటోలో వెళ్లారు. అక్కడ దిగినపుడు ఆటోలో బ్యాగ్ మర్చిపోయారు. ఆటో డ్రైవర్ కూడా చూడకుండా వెళ్లిపోయాడు. ఆ వెంటనే బ్యాగ్ ఆటోలో మర్చిపోయినట్లు గుర్తించి 112కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేసింది. దీంతో వెంటనే స్పందించిన క్రైం డీసీపీ నాగన్న ఆదేశాలతో సీఐ కూన దుర్గా ప్రసాద్ పర్యవేక్షణలో గోపాలపట్నం ఎస్‌ఐ ఎస్ నర్సింగరాజు దర్యాప్తు చేపట్టారు. సీసీపుటేజీల ఆధారంగా గంటలో ఆటోను గుర్తించి పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ కనకరాజు ఆటోలో బ్యాగ్ ఉన్నట్లుగా గమనించలేదు. తీరా అందులో తనిఖీ చేయగా రూ.70వేల నగదు ఉంది. బాధితురాలు చెప్పిన విధంగా నగదు ఉండడంతో ఆమెకు నగదు ఉన్న దుస్తుల బ్యాగ్ అందించారు. నిజాయితీగా బ్యాగ్‌ను అందించి ఆటో డ్రైవర్‌కు రూ. 2000 నగదు అందించి అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా భోగి మంట



భోగి మంట వేసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు భోగి మంటలు వేసి వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. పిఠాపురం కాలనీలోని సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం భోగి మంట వేసి స్టీల్ ప్లాంట్‌ను విక్రయించొద్దంటూ నినాదాలు చేశారు. నిరసనగా భోగి మంటలో ఒక్కో కట్టె వేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కె.ఎం.కుమార్ మంగళం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్మేస్తామని ప్రధాని మోదీ ప్రకటించి రెండేళ్లు గడుస్తోందన్నారు. నాటి నుంచి నేటి వరకూ ప్రజా సంఘాలతో కలిసి నిరంతరం పోరాటాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం చేయాలని చూస్తే బీజేపీ ప్రభుత్వానికి ప్రజా సంఘాలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మణి, సీతామహాలక్ష్మి, పి.వెంకటరావు, జె.ఆర్.నాయుడు, శ్రీను, వరలక్ష్మి, కె.కుమారి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహ దీక్ష విరమణ



ఘాట్ రోడ్డులో తిరుముడులతో వస్తున్న దీక్షాధారులు

సింహాచలం: అడవివరానికి చెందిన సింహాద్రి మఠం ఆధ్వర్యంలో శ్రీనృసింహ దీక్షల విరమణ శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. మండల దీక్ష, 32రోజుల దీక్ష చేసిన 3860 మంది భక్తులు సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో దీక్షా విరమణ చేశారు. దీక్ష విరమించినవారిలో విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దీక్షాదారులంతా ఘాట్ రోడ్డు, మెట్లమార్గంలో తిరుముడులతో సింహగిరికి చేరుకున్నారు. అనంతరం సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దీక్ష విరమణ చేశారు. దేవస్థానం తరఫున దీక్షాదారులందరికీ స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

ఘనంగా ధారోత్సవాలు



అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవార్ల చెంత పాశుర పారాయణం చేస్తున్న స్థానాచార్యులు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నాలుగోరోజు ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకిలో, మరో పల్లకిలో సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు, గోదాదేవి అమ్మవారిని తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లను అధిష్ఠంపజేసి పంచామృతాభిషేకం చేశారు. గంగధార వద్ద ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను అధిష్టంపజేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజ భోగ నివేదన ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పిస్తామని తెలిపారు.

సత్తా చాటిన ఆంధ్రా బాడీ బిల్డర్లు

మిస్టర్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా రాజేష్



మిస్టర్ ఇండియా పోటీల్లో సత్తా చాటిన రాజేష్

అల్లిపురం : పశ్చిమబెంగాల్లో ఈ నెల 11,12 తేదీల్లో జరిగిన 57వ మిస్టర్ ఇండియా-2023 పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొని తమ సత్తాచాటారు. దేశ నలుమూలల నుంచి 29 రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 65 కేజీల విభాగంలో పోటీపడ్డ రాజేష్ ప్రథమ స్థానంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ రన్నరప్‌గా నిలిచి ఆంధ్రప్రదేశ్ కీర్తి, ఖ్యాతిని దేశం నలుమూలలా చాటారు. అలాగే 70 కేజీల కేటగిరీలో సంగడి రమేష్ ద్వితీయ స్థానం సాధించగా, 80 కేజీల విభాగంలో నార్ని శివదుర్గా అవినాష్ మూడో స్థానం సాధించారు. మాస్టర్ విభాగంలో కె.రామునాయుడు నాలుగో స్థానంలో సత్తా చాటారు. ఏపీ నుండి పాల్గొన్న వారందరూ టాప్ 10లో నిలిచారు. మిస్టర్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.గురునాథరావు, కోశాధికారి టి.రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వి.విజయకుమార్, జోగి కిరణ్, ఉపాధ్యక్షుడు బీపీ రెడ్డి, జి.విష్ణుమూర్తి అభినందనలు తెలిపారు.

పెద్ద పండగకు వేళాయె..

- నేడు భోగ భాగ్యాల భోగి
- మకర సంక్రాంతితో కొత్త వెలుగులు
- విందు భోజనాల కనుమ



సంక్రాంతి ముగ్గు వద్ద తెలుగు వారి సందడి

కంచరపాలెం: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతికి వేళాయింది. పిల్లలు, పెద్దలు అంతా కలిసి సందడి చేసే సమయం ఆసన్నమైంది. మూడు రోజుల ముందుగానే నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. శనివారం భోగి పండగతో మకర సంక్రాంతికి ప్రజలు స్వాగతం పలకనున్నారు. భోగి రోజున వేడి నీళ్ల స్నానం.. సంక్రాంతి రోజున సంప్రదాయ పూజలు, కనుమ రోజున నోరూరించే విందు భోజనాలతో తెలుగు వారు సంతోషంగా గడుపుతారు. ఏటా సంక్రాంతి పండగ రోజుల్లో ఎన్నో విశేషమైన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అవేంటో తెలుసుకుందాం..

భోగి మంటలు..

భోగి మంట లేకుండా సంక్రాంతి సందడి మొదలు కాదు. ఈ పండగలో మొదట వచ్చే భోగి రోజు ఉదయాన్నే ప్రజలు మంటలు వెలిగించి వేకువజామున వేనీళ్ల స్నానం చేస్తారు. దీని కోసం నెలరోజుల ముందు నుంచే విరిగిన వస్తువులు, చెక్కలు సేకరించి దాచిపెడతారు. భోగి స్నానాలు చేసి మంటకాస్తే పిల్లలు బాగా ఎదుగుతారనే నానుడి ఉంది.

మేలుకొలుపు..

ధనుర్మాసం ప్రారంభమైంది మొదలు మేలుకొలువు సందడి కూడా ఉంటుంది. పల్లె ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వేకువజామున హరినామ స్మరణ, కీర్తనలు పాడుతూ కాలనీల్లో తిరుగుతూ కానుకలు స్వీకరిస్తారు. కంచరపాలెం, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం మొదలు నగరమంతటా మేలుకొలుపు నిర్వహిస్తుంటారు.

పరసల కోలాహలం

ప్రతి ఏటా సంక్రాంతి పండగ రోజున జ్ఞానాపురం, కంచరపాలెం... ముక్కనుమ రోజున రామ్మూర్తిపంతులుపేటలో పరస మహోత్సవాలు జరుపుతారు. ఏడు గ్రామాల ప్రజలు ఇందులో పాల్గొంటారు. సాముగరిడి, కోలాటం, పులివేషాలు, తప్పెటగుళ్లు, నేలవేషాలు, చెట్టు భజన తదితరాలు ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తాయి. నగరంలోని పలుప్రాంతాల ప్రజలు పరసల సందడిని చూడడానికి వస్తారు.

పిల్లలు-పతంగులు..

సంక్రాంతి వచ్చిందంటే చాలు పిల్లలకు పతంగుల పండగే. ఆ రోజున రంగురంగుల గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేస్తారు. ఇప్పటికే పలు చోట్ల పతంగులు అమ్మే ప్రత్యేక దుకాణాలు వెలిశాయి.

ముచ్చటగొలిపే రంగవల్లులు..

రంగవల్లుల సందడి జనవరి ఒకటి నుంచే మొదలవుతుంది. ఒకరికి పోటీగా మరొకరు కొత్త ఏడాదికి ఆహ్వానం పలుకుతూ మహిళల ముగ్గుల పరంపర సంక్రాంతికి తారాస్థాయికి చేరుకుంటుంది. లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ వివిధ రంగులతో రంగవల్లులను తీర్చిదిద్దుతారు. రథం, హరిదాసు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి నత్యాలు చేస్తారు. అందరి కంటే తాము వేసిన ముగ్గే అందంగా ఉండాలని తాపత్రయ పడుతుంటారు. ఈ ఆసక్తిని గమనించే పలు కాలనీ సంఘాలు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తుంటారు.

హరిదాసుల సందడి..

సంక్రాంతి పండగంటే మదిలో మెదిలేది హరిదాసులే. తల మీద అక్షయపాత్ర, ఓ చేతిలో తంబుర, మరో చేతిలో చిడతలు వాయిస్తూ వారి రూపం మన కళ్ల ముందు కదలాడుతుంది. వాడవాడల్లో హరిదాసులు తిరుగుతూ సంక్రాంతి శోభను ఇంటికి తీసుకొస్తారు. వీరిలో ఓ ప్రత్యేకత ఉంది. ఒకరు వెళ్లే ప్రాంతానికి మరొకరు వెళ్లరు. అక్షయపాత్ర తలపై ఉన్నంత సేపు మరొకరితో మాట్లాడరు. ఇలా సరదాగా.. సందడిగా.. ఆనందంగా ప్రజలంతా బంధు మిత్ర, కుటుంబ సమేతంగా సంక్రాంతి పండగను జరుపుకుంటారు.

ముగిసిన స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు

అల్లిపురం: వన్‌టౌన్‌లోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీ స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా 500 మందికి ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ దుప్పట్లు అందజేసి, అన్నదానం నిర్వహించారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు సీఎంఏ జహీర్ అహ్మద్, డాక్టర్ రమణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, రౌండ్ టేబుల్ సభ్యులు మక్సుద్ అహ్మద్, ఉరుకూటి నారాయణరావు, చెన్నా జానకీరామ్ పాల్గొన్నారు.

108 రకాల స్వీట్లతో సారె సమర్పణ



అమ్మవారికి నివేదించిన 108 రకాల స్వీట్లు

సీతంపేట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం లలితా నగర్‌లోని లలితా పీఠంలో భోగి పండగ నాడు గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారి భక్తులు శుక్రవారం సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహించారు. పలువురు భక్తులు, మహిళలు పాల్గొని పసుపు, కుంకుమ, గాజులు, చీర, పువ్వులు, పండ్లు, 108 రకాల స్వీట్లు సారెలో ఊరేగించారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో అమ్మవారికి నివేదించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.